క్లుప్తంగా

శానిటరీ సిబ్బందికి పరికరాల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె పంపిణీ చేస్తున్న దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు శానిటరీ సిబ్బందికి సబ్బులు, కొబ్బరినూనె వంటి ఉపకరణాలు పంపిణీ చేశారు. మల్కాపురం శానిటరీ కార్యాలయం వద్ద మంగళవారం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, నాయకులు మజ్జి సోమేష్,ఉరుకూటి పైడిరాజుయాదవ్ తదితరులు సిబ్బందికి కిట్ రూపంలో అందించారు.

పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లోని పశువులకు గాంధీగ్రామ్ పశువుల ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ మంగళవారం గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ గొంతువాపు వ్యాధికి లోనైన పశువులు తీవ్రజ్వరంతో గొంతు వాచిపోయి మేత మేయలేక చనిపోతాయన్నారు. తొలకరి వర్షాలు పడడంతో పశువులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని, ముందస్తుగా గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. వీటితో పాటు పొట్టజలగలు, నట్టలు ఈ కాలంలో గడ్డి ద్వారా పశువులకు సంక్రమిస్తాయన్నారు. పశువులకు నట్టల నివారణ మందు వేయించాలన్నారు. మంగళవారం సుమారు 175 పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు.

కళాకృతుల తయారీలో శిక్షణ



కళాకృతుల తయారీలో మెలకువలు నేర్పుతున్న అనసూయాదేవి

మల్కాపురం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం చిన్నారులకు కళాకృతుల తయారీలో ఉచిత శిక్షణ ఇచ్చారు. జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి వై.అనసూయాదేవి పాల్గొని చిన్నారులకు పేపర్‌తో బొమ్మలు,పుష్పాల తయారీలో శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల బాలల్లో సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్‌గా చంద్రశేఖర్



చంద్రశేఖర్

విశాఖ విద్య: విశాఖ జిల్లా మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్‌గా జీవీఎంసీ 52 వ వార్డు న్యూ కరాసా ప్రాంతానికి చెందిన వెంకు మహంతి చంద్రశేఖర్ (చందు) నియమితులయ్యారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని చంద్రశేఖర్ తెలిపారు.

నిబంధనలు మీరితే కఠిన చర్యలు

పెందుర్తి: సమయ పాలన పాటించకుండా.. నిబంధనలు అతిక్రమించి బార్లు, మద్యం దుకాణాలు, హోటళ్లు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆయా వ్యాపారాలు నిబంధనలు విరుద్ధంగా వ్యవహరిస్తే తక్షణమే తమకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. మంగళవారం పెందుర్తి సర్కిల్ పరిధిలోని బార్లు, మద్యం దుకాణాలు, హోటళ్లకు సమయ పాలన, అనధికారిక విక్రయాలపై యాజమాన్యాలకు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం విక్రయాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు, బార్‌లు 10 నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యాన్ని, హోటళ్ల రాత్రి 12 గంటల వరకు మాత్రమే ఆహారాన్ని అందించాలని సూచించారు


విశేషంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కొండవాలు.. గుండెజారు

- వర్షాలతో కలవరపడుతున్న కొండవాలు ప్రాంత ప్రజలు
- కలగానే మిగులుతున్న రక్షణ గోడల నిర్మాణం
- చొరవ చూపని ప్రజాప్రతినిధులు

కొండవాలు ప్రాంత ప్రజలు వానొస్తే వణుకుతున్నారు. ఏ బండ వచ్చి మీద పడుతుందోనని కలవర పడుతున్నారు. మట్టి జారి ఎక్కడ ఇళ్లు కూలుతాయోనని ఆందోళన చెందుతున్నారు. గత పరిణామాలను తలచుకుని భయపడుతున్నారు. ఏ మాత్రం వర్షం కురిసినా బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. రక్షణ గోడల నిర్మాణం కలేనా అంటూ వాపోతున్నారు.



రక్షణ గోడలు లేని త్రినాథపురం కొండవాలు ప్రాంతం



సింథియా: పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని కొండవాలు ప్రాంతాలైన దుర్గానగర్, ఎస్సార్‌కాలనీ, త్రినాథపురం, కాకరలోవ, చింతల్లోవ, క్రాంతినగర్, అంబేడ్కర్‌కాలనీ, జనతాకాలనీ వంటి ప్రాంతాల్లో ప్రజలు వానొస్తే బితుకు బితుకు మంటున్నారు. రక్షణ గోడలు, వీధిలైట్లు లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలతో సరిపెడుతుందే తప్పా శాశ్వత పరిష్కారం చూపించడం లేదు. ప్రజాప్రతినిధులు ఓట్ల కోసం తప్పా తమ సమస్యలు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

పారిశ్రామిక ప్రాంతం జీవీఎంసీ 59, 60, 61, 62, 63 వార్డుల్లో దాదాపు లక్షన్నర మంది జీవిస్తున్నారు. వీరిలో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు ఉన్నారు. ఇందులో అధికశాతం నిరుపేదలే ఉండడంతో కొండవాలు ప్రాంతాల్లో జీవిస్తున్నారు. ఇక వర్షాకాలంలో వారు పడే బాధలు వర్ణనాతీతం. మట్టి పెళ్లలు విరిగి ఇళ్లపై పడడం, ఇళ్లకు వెళ్లడానికి సరైన మెట్లు లేక జారి పడడం, విద్యుత్ లైన్లు అస్తవ్యస్తంగా ఉండడంతో కరెంటు షాక్ కొట్టడం, రక్షణ గోడలు లేక బండరాళ్లు దొర్లడం, విషసర్పాలు, క్రిమికీటకాలు ఇళ్లలోకి ప్రవేశించడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు.



వర్షాలకు 61వ వార్డులో కూలిన మల్ల రాము ఇల్లు(ఫైల్)



వర్షాలకు నేలకూలిన అన్సార్ అలీ ఇల్లు (ఫైల్)

భయపెడుతున్నారు

కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని కోరితే అధికారులు ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. దేశంలోని అనేక పర్యాటక ప్రదేశాలు కొండప్రాంతాల మధ్యనే అభివృద్ధి చెందినప్పటికీ .. నివసించే ప్రజల జీవనప్రమాణాలు మాత్రం బాగుపడలేదని చెబుతున్నారు.

వెంటాడుతున్న గత విషాదాలు

గతంలో మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు 59వ వార్డు గణపతినగర్ కొండపై ఉన్న ఓ ఇంటిపై బండరాళ్లు దొర్లిపడి మూడేళ్ల బాలుడు, గర్భిణి మృతి చెందిన సంఘటన విశాఖ వాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. అదే విధంగా జీవీఎంసీ 59వ వార్డు ములగాడ మండలం ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీలోని అన్సర్‌అలీ ఇల్లు కింద ఉన్న మట్టి జారిపోయి ఇల్లు నేలకూలింది. వర్షాలకు మట్టి జారి పోతుండడంతో అందులో నివసిస్తున్న వారంతా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. అదే విధంగా జీవీఎంసీ 61వ వార్డు రజకవీధిలో మల్లరాము అనే నిరుపేదకు చెందిన పెంకుటిల్లు మూడు రోజులు పాటు కురిసిన భారీ వర్షాలకు నేలకూలింది. ఇటువంటి సంఘటనలు ఎక్కడో ఒక చోట తరచూ జరుగుతున్న ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోకపోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తుంది.ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

భయం.. భయం



సాధారణ రోజుల్లో ఎలా ఉన్నా వర్షాకాలంలో మాత్రం కంటి మీద కునుకు ఉండడం లేదు. విషసర్పాలు ఇళ్లలోకి చేరడం, వర్షపునీరు రావడంతో పాటు బండరాళ్లు దొర్లుతాయామోనని భయంగా ఉంటుంది. ప్రభుత్వం చొరవ తీసుకుని రక్షణ గోడలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– మద్దాలి చిన్నారి, 62వ వార్డు

రక్షణ గోడలు నిర్మించాలి



వానొస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంటుంది. ముఖ్యంగా పగలంతా కష్టపడి పనిచేసి ఇంటికి వస్తాం .రాత్రికి వర్షం వస్తే భయంగా ఉంటోంది. రక్షణ గోడలు నిర్మిస్తే మాకు రక్షణ ఉంటుంది.

–పెంటారావు, చింతల్లోవ

మర్యాద పూర్వక కలయిక



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వెంకటరెడ్డి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెం ప్రాంతానికి చెందిన విజ్ఞాన్ టాలెంట్ స్కూల్ అధినేత వెంకటరెడ్డి మంగళవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో నూకరాజు

తన విద్యా సంస్థల ద్వారా పేద విద్యార్థులకు అందిస్తున్న సాయం, చేపడుతున్న కార్యక్రమాలను జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు.

గోపాలపట్నం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తో కలసి 88వ వార్డు నాయకుడు దాడి నూకరాజు కలిశారు. జగన్‌మోహన్ రెడ్డిని కలవడం చాలా సంతోషాన్నిచ్చిందని తెలిపారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన

గోపాలపట్నం: కిశోర బాలికల మానసిక, శారీరక ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సెక్టార్ సూపర్‌వైజర్ జేటీఎస్ జ్యోతి అన్నారు. గోపాలపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర బాలికలకు లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షతను వ్యతిరేకించాలన్నారు. ఎదిగే పిల్లల్లో పౌష్టికాహార లోపం తలెత్తే అవకాశముందని దాన్ని అధిగమించాలన్నారు.



కిశోర బాలికలతో అధికారులు, సిబ్బంది

కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మాధవి, బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వర్షంతో పొంగిన కాల్వలు



కొత్తపాలెం వెళ్లే దారిలో గెడ్డలో వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

గోపాలపట్నం: వర్షానికి కాల్వలు పొంగిపొర్లాయి. దీంతో ఎక్కడికక్కడ కాల్వల్లో చెత్త పేరుకు పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఖజానా జ్యుయలరీ దుకాణం వద్ద కాల్వలు మూసుకు పోడంతో మురుగు నిలిచిపోయింది. 92వ వార్డు శానిటరీ అధికారులు, సిబ్బంది హుటా హుటిన కాలువపై పలకలు తొలగించి శుభ్రం చేశారు. దుకాణదారుడు కాలువలోకి నీరు వెళ్లకుండా మూసి వేయడంతో ఈ పరిస్థితి దాపరించిందని స్థానికులు చెబుతున్నారు. అలాగే కొత్తపాలెం వెళ్లే దారిలోని గెడ్డలో చెత్త పేరుకు పోవడంతో తొలగింపు చర్యలు చేపట్టారు.

ప్రజలను మోసం చేయడమే కూటమి ధ్యేయమా?

- సూపర్ సిక్స్ ఫథకాలు అమలు చేయాలి
- సీపీఐ నాయకుడు సత్యాంజనేయ

మల్కాపురం: ఎన్నికల ముందు పేద ప్రజలకు కూటమి నాయకులు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని సీపీఐ పశ్చిమ నియోజక వర్గ నాయకుడు కాండ్రేగుల సత్యాంజనేయ డిమాండ్ చేశారు. అర్హులైన పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చుతామని, పట్టాలు అందిస్తామని,సూపర్ సిక్స్ పథకాల ద్వారా రాష్ట ప్రజలను ఆదుకుంటామని మోసం చేసిన కూటమి నాయకుల తీరును నిరసిస్తూ ములగాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు,పవన్ కల్యాణ్‌లది ఎన్నికల ముందు వరకు ఒక మాట,ఎన్నికలు ముగిసాక మరో మాట అన్న తీరుగా పాలన ఉందని ఆరోపించారు. అమరావతి అభివృద్ధి చేస్తామని వేల కోట్ల రూపాయలు అప్పుల తెస్తూ ప్రజల నోట్లో మట్టి కొడుతున్నారని మండిపడ్డారు. నమ్ముకున్న ప్రజలను మోసం చేయడమే కూటమి లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ఇప్పటికైనా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ములగాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

వేడుకగా బంగారమ్మ పండగ



పూజలందుకున్న బంగారమ్మ



కాంతార వేషధారణతో నృత్యాలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం గ్రామ ప్రజలు ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి బంగారమ్మ ప్రధానపండగను త్రివేణి గ్రామ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్య స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారికి జలాభిషేకం, క్షీరాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే పి.గణబాబు, కార్పొరేటర్ బొమ్మిడి రమణ అమ్మవారిని దర్శించుకున్నారు.వారికి అమ్మవారి ప్రసాదాలు అందజేసి సత్కరించారు. సాయంత్రం పలు విచిత్ర వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ప్రతిమలను పురవీధుల్లో ఊరేగించారు. కాంతార వేషధారణలో చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో త్రివేణి గ్రామ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షులు ఎలమంచిలి చంద్రరావు, గౌరవ అధ్యక్షుడు పురెడ్డి గురు రామిరెడ్డి, మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, కార్యదర్శి గొందేశి రాము, కోశాధికారి దొడ్డి జగదీశ్వర రావు, ఉపాధ్యక్షులు మళ్ల కనకరాజు, కమిటీ సభ్యులు దొడ్డి కనకరాజు(కన్నా), దొడ్డి సతీష్, శరగడం అరుణ్ కుమార్, నైదానం గోపి, నమ్మి రాజు పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

వాన.. హైరానా

- ములగాడ మార్గంలో చేరిన వరద నీరు
- ఇబ్బందులు పడ్డ ప్రజలు



ఆర్‌కేపురం రోడ్డులో నిలిచిన వర్షపునీరు

మల్కాపురం: చినుకు పడితే ఆ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. పూర్తిగా శిథిలమైన మార్గంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ములగాడ సేవా మార్గంలో నీరు చేరింది. గుంతల్లో నీరు చేరడంతో ఈ మార్గాన వచ్చే పలువురు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఇదీ పరిస్థితి

.డాక్‌యార్డు వంతెన మూసివేయడంతో ములగాడ సేవా మార్గానికి రద్దీ పెరిగింది.అసలే రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో తరచూ తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో గ్రామస్తులు,వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు.దీనికి తోడు ములగాడ విలేజ్ నుంచి శ్రావణ్ షిప్పింగ్‌కు వెళ్లే మార్గం పూర్తిగా గుంతలమయంగా మారింది.భారీ వర్షానికి గుంతల్లో నీరు చేరడంతో వాహనాలు అదుపు తప్పి ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌లో ఇరుక్కొని ఉద్యోగులు సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోయారు.



ట్రాఫిక్‌లో ఇరుక్కున్న ఉద్యోగులు

ఉత్తుత్తి హామీలేనా..

అధికారంలోకి రాక ముందు కూటమి నాయకులు ములగాడ గ్రామంలో గుంతల మయంగా ఉన్న సేవా మార్గాన్ని అభివృద్ధి చేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నేటికీ ఈ సేవా మార్గానికి మోక్షం లభించలేదు.దీంతో ములగాడ గ్రామస్తులతో పాటు వాహనదారులు పాలకుల తీరును ఎండగడుతున్నారు.

జలమయమైన రోడ్డు

మల్కాపురం: వర్షం దంచికొట్టింది. సోమవారం అర్ధరాత్రి, మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి పారిశ్రామిక ప్రాంతం తడిసి ముద్దయింది. గెడ్డలు పొంగిపొర్లాయి. రోడ్లపైకి వరదనీరు చేరడంతో వాహనదారులు,పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద గల గెడ్డ పొంగి సేవా మార్గంపైకి నీరు చేరింది.గెడ్డలో ప్లాస్టిక్,ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు చేరి ఉప్పొంగింది.



ములగాడ నుంచి శ్రావణ్‌షిప్పింగ్‌కు వెళ్లే మార్గంలో నిలిచిన వర్షపునీరు



శ్రీహరిపురం సేవా మార్గం ఇలా..

అనాథ బాలలకు అన్నదానం



బాలలకు అన్నం వడ్డిస్తున్న బాలు భార్గవ్

కంచరపాలెం: సినీ నటుడు నిర్మాత మంచు మనోజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మంగళవారం వైజాగ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ బాలు భార్గవ్ ఆధ్వర్యంలో 104 ఏరియాలో కేర్ అండ్ లవ్ అనాథాశ్రమంలో అనాథ బాలలకు అన్నదానం చేసి, నిత్యావసర సరుకులు అందజేశారు. ముందుగా పిల్లల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనాథలకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా బాలు భార్గవ్ మాట్లాడుతూ వైజాగ్‌లో ఫ్యాన్స్ వందల సంఖ్యలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30న విడుదలయ్యే భైరవం సినిమా సూపర్ హిట్ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెమినీ గణేష్, దాడి వెంకటేష్, అనిల్, శంకర్, ఎల్లాజీ, పవన్, సతీష్, ప్రసాద్, అభిమాలు తదితరులు పాల్గొన్నారు.

పూడికలు తొలగించడానికి చర్యలు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ ప్రధాన వైద్యాధికారి (సీఎంహెచ్‌వో) నరేష్‌కుమార్ మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా ఐవోసీ వద్ద గల ప్రధానగెడ్డను పరిశీలించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు రావడంతో గెడ్డలో పూడిక పేరుకుపోవడంతో రహదారిపైకి మురుగునీరు వచ్చేస్తుందని గుర్తించారు. దీంతో ఆ ప్రాంతం అంతా దుర్గంధం వెదజల్లుతుందని, సమస్య పరిష్కరించేందుకు అధికారులకు కొన్ని సూచనలు ఇచ్చారు.

అనంతరం ఏకేసీకాలనీ, మరిడిమాంబ కల్యాణమండపం వద్ద ప్రధాన గెడ్డను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా యుద్ధప్రాతిపదికన గెడ్డలో పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి చెత్తను ఇష్టానుసారం వేయవద్దని కోరారు. అధికారులు కూడా పారిశుధ్య పనులపై నిత్యం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–5 ప్రజా ఆరోగ్యశాఖ సహాయ వైద్యాధికారి సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రమేష్, డి.రవికుమార్, ఇతర జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



ఏకేసీకాలనీలో అధికారులకు సూచనలిస్తున్న ప్రజారోగ్య అధికారి నరేష్‌కుమార్

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అసంఘటిత కార్మికులు

పరవాడ: లేబర్ కోడ్లను రద్దు చేసి అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పరవాడ, లంకెలపాలెం కూడళ్లలో మంగళవారం అసంఘటిత కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారం చేపట్టిన తరువాత కార్మిక చట్టాలన్నిటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌ను తీసుకువస్తుందన్నారు. లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కనీస వేతనాలు అమలు కాక, ఉద్యోగ భద్రత లేక కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఒక విధంగా చెప్పాలంటే దేశంలో ఇది నిరంకుశ విధానాలను అవలంబించడమేనన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. సమ్మెను విజయవంతం చేయడానికి కార్మిక సంఘాలు ముందుకు రావాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, కర్ణం వెంకటరావు, వెంకటస్వామి, నాగేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.